యంత్రాంగం అప్రమత్తం

- ధాన్యం దాచుకునేందుకు గోదాములు సిద్ధం
- కోత కోసి పొలాల్లో ఉన్న పంటకు ప్రాధాన్యం
- పెడన తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు



చెన్నూరు రహదారిలో ధాన్యం బస్తాలపై పరదాలతో రక్షణ



హంసలదీవి సాగరతీరం వద్ద ఎగసిపడుతున్న సముద్ర అలలు

పెడన: మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పెడన మార్కెట్ యార్డులోని గోదాములను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిణి వి.పార్వతి, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, తహసీల్దారు పి.మధుసూదనరావు ఆదివారం రాత్రి పరిశీలించి గోదాములను సిద్ధం చేశారు. రైతులు ఎవరైనా పంటను కోసి కల్లాల్లోనే ఉంచితే వారు గోదాముల్లో దాచుకునేందుకు అవకాశం కల్పించినట్లు డీఎస్‌వో పార్వతి తెలిపారు. ఆ గోదాముల వద్ద సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. సోమవారం తహసీల్దారు గురువిందగుంట, కవిపురం, కొప్పెల్లి తదితర గ్రామాల వెంబడి పర్యటించారు. రైతులు ఎవరైనా ఇబ్బందులు పడుతున్నారేమోనని గమనించి పలు సూచనలు చేశారు. వ్యవసాయశాఖాధికారులు, వీఏఏలు, వలంటీర్లు ద్వారా ధాన్యం దాచుకునేందుకు రైతులు ముందుకు వస్తే వారికి మార్కెట్ యార్డులోని గోదాముల సమాచారం ఇవ్వాల్సిందిగా తహసీల్దారు సూచించారు.

రైతుల ప్రయత్నాలు..

రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పనులు పూర్తయిన రైతులు ఇప్పటికే బయట మార్కెట్‌లో విక్రయించుకోగా, మరికొందరు బస్తాల్లోకి ఎత్తి రోడ్లు పక్కన భద్రపరిచారు. వర్షానికి తడవకుండా బస్తాల కింద, పైన టార్పాలిన్‌తో కప్పేశారు. పెడన, గుడివాడ జాతీయ రహదారి పక్కనే కాకుండా నడుపూరు, కూడూరు, పెనుమల్లి, పుల్లపాడు రహదారుల్లోను, గురువిందగుంట, చెన్నూరు మార్గంలో కూడా చాలా మంది రైతులు ఈ విధంగా ధాన్యాన్ని భద్రపరుచుకున్నారు. కొందరు పంట కోత కోయకుండా ఉంచేయడంతో ఆందోళన చెందుతున్నారు. గింజ రాలిపోతుందని, కిందపడిపోయి మొలకలు వస్తాయని భయం వ్యక్తం చేస్తున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

పెడన తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గత నాలుగు రోజులుగా రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు, ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టులు ప్రకారం సిబ్బంది ఉంటున్నారు. 9989346945, 6302684325, 8106924830లను సంప్రదించవచ్చు.

ఆందోళనలో తీరప్రాంత గ్రామాలు

కోడూరు: మిచాంగ్ తుపాను ప్రభావం తీరప్రాంత గ్రామాల్లో తీవ్రంగా ఉంది. ఊటగుండం శివారు నిపాలెం గ్రామం వద్ద సముద్రనీరు కరకట్టను తాకినట్లు గ్రామస్తులు తెలిపారు. 1977 నవంబర్‌లో సంభవించిన దివిసీమ ఉప్పెన సమయంలో కూడా వాతావరణం ఇదే తరహాలో ఉందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ తుపాను దివిసీమ ప్రాంతానికి సమీపంలోనే తాకుతుందని అధికారులు చెప్పడంతో ఉప్పెన ఘటనను గుర్తు చేసుకొని ఆందోళన చెందుతున్నారు.



పెడన మార్కెట్ యార్డులో గోదాములను పరిశీలిస్తున్న డీఎస్‌వో పార్వతి, ఆర్డీవో వాణి

ప్రత్యేక బస్సుల్లో తరలింపు

కోడూరు: తుపాను ప్రభావంతో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తొలుత ఆయా గ్రామాల్లోనే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. తుపాను తీవ్రత అధికంగా ఉండడంతో ఏర్పాటును మండల కేంద్రానికి మార్చారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల, దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో తీరప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించారు. తీరప్రాంత గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా గ్రామస్తులను కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన వసతులను సమకూర్చారు. గ్రామస్తులంతా కేంద్రాలకు స్వచ్ఛందంగా తరలిరావాలని అధికారులు మైక్ ప్రచారం చేశారు. కేంద్రం వద్దే తీరప్రాంత ప్రజలకు భోజనం, అల్పాహారాన్ని అందించారు. తుపాను ప్రభావం తొలగే వరకు పునరావాసం కొనసాగుతుందని తెలిపారు.

సమష్టి కృషితో నష్ట నివారణ చర్యలు



చల్లపల్లి: రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా సమష్టి కృషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక రైస్ మిల్లులను ఎమ్మెల్యే పరిశీలించారు. మిల్లు నిర్వాహకులతో మాట్లాడి పరిస్థితి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో యంత్రాంగం మొత్తం కలిసి పని చేస్తున్నామని, కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా యుద్ధప్రాతిపదికన రైస్ మిల్లులకు, గోడౌన్లకు తరలిస్తున్నట్లు తెలిపారు. వర్షంలో కూడా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, ముఠా కార్మికులు శ్రమిస్తున్నారని తెలిపారు. ధాన్యం కల్లాల్లో ఉన్న రైతులు అధికారులకు చెప్పి మిల్లులకు చేర్చుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ గోడౌన్లు వినియోగించుకుంటామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, తహసీల్దార్లు గోపాలకృష్ణ, రామానాయక్, ఏఓ సాయిసింధు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు..

ఘంటసాల(అవనిగడ్డ): రైతులు అధైర్య పడొద్దని, ధాన్యంకొనుగోలుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఘంటసాల మండలంలో ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పర్యటించారు. రైస్‌మిల్లర్లు, రైతులు, అధికారులతో మాట్లాడారు. పంటను కొనుగోలుకు సీఎం జగన్ నిబంధనలు సడలించారని, ఆమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కోనేరుసెంటర్: మిచాంగ్ తుపానుతో బందరు మండలంలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా ఎస్పీ పి.జాషువాలు ప్రజల యోగక్షేమాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. తుపాను ప్రభావిత గ్రామాలైన (సముద్రతీర ప్రాంతగ్రామాలు) కానూరు, పెదపట్నం, తాళ్లపాలెం, మంగినపూడి, తపసిపూడి, కరగ్రహారం, పోలాటితిప్ప. పీటీపాలెం, కేపీటీ పాలెం, వాడపాలెం, కోనలో గ్రామస్తులను అప్రమత్తం చేయటంతో పాటు ఆయా గ్రామాల్లోని తుపాను షెల్టర్‌లు, పాఠశాల భవనాల్లోకి ఇప్పటికే అనేక మందిని తరలించారు. వారికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందికి రైయిన్‌కోట్‌లు, టార్చిలైట్‌లను అందజేశారు. తుపాను తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లోనే ఉండేలా చర్యలు తీసుకున్నారు. వైద్య సిబ్బంది ఆరోగ్యకేంద్రాల్లో ఉండేలా మందులను వైద్య శిబిరాల్లో ఉంచారు. మహిళా సంరక్షణ కార్యదర్శులతో పాటు ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పొలాల్లోని ధాన్యాన్ని లారీలు, ట్రాక్టర్‌ల మీద మిల్లులకు తరలించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లావ్యవసాయ అధికారి పద్మావతి, మండల తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, మండల అధికారి డి.హారిక మండంలోని పలు గ్రామాల్లో పర్యటించి బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని దగ్గరుండి మిల్లులకు తరలించారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

గ్రామాల్లో పర్యటించిన పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు తీరప్రాంత గ్రామాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు సోమవారం పర్యటించారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వెళ్లిన ఆయన మండల ప్రజలకు పలు జాగ్రత్తలు చెప్పారు. తీరప్రాంత గ్రామాలైన గిలకలదిండి, పోలాటితిప్ప, మంగినపూడి, తపసిపూడి, గోపువానిపాలెం, కానూరు, పెదపట్నం తదితర తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన కిట్టు వాతావరణ పరిస్థితులపై ఆయా గ్రామాల ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. తీవ్రతను బట్టి ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల్లోని గ్రామస్తులందరూ అధికారులు ఏర్పాటుచేసిన సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలని సూచించారు. తుపాను తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు సురక్షిత కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించటం జరుగుతుందని చెప్పారు. పర్యటనలో వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గం కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంగా జగన్ కొనసాగాలి

గూడూరు: 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమం సోమవారం గూడూరు మండలం కప్పలదొడ్డిలో నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు రాష్ట్రానికి జగనన్న ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు , జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, పార్టీ కన్వీనర్ పర్ణం పెదబాబు, సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తుపాను నుంచి కాపాడాలని పూజలు

నాగాయలంక: మిచాంగ్ తుపాను బారి నుంచి తప్పించి, రైతన్నలను కాపాడాలంటూ మండలంలోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని భావదేవరపల్లి శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో అలయ అర్చకుడు శ్రీహరి ప్రకృతి విపత్తుల నివారణార్థం పూజాదికాలుచేశారు. స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయ కమిటి చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘం నేతలు ఆధ్వర్యంలో అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో తుపాను విపత్తు నుంచి ప్రజలను కాపాడాలంటూ నగరేశ్వరునికి పూజలు నిర్వహించారు.దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య,తాడికొండ సత్యనారాయణ, మునగాల మోహనరావు,శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

దీపారాధన

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా సోమవారం లక్షవత్తులతో దీపారాధన నిర్వహించారు. మహిళా భక్తులు సుబ్బారాయుడి సన్నిధిలో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాయపడిన వ్యక్తి మృతి

బండికోళ్లంక(మోపిదేవి): మోపిదేవి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాసుపల్లి నారాయణ (36) గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 1వ తేదీ సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురై హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- మంత్రి జోగి రమేష్
- కొమాళ్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం
- జోరు వర్షాన్ని లెక్కచేయకుండా పర్యటించిన మంత్రి



కొమాళ్లపూడిలో వర్షంలో పర్యటిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొమాళ్లపూడి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. జోరు వర్షం కురుస్తున్న మంత్రి తన పర్యటనను యథావిధిగా కొనసాగించారు. ప్రతి ఇంటిని సందర్శించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వాటి వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో మన ముఖ్యమంత్రి జగనన్న పేదల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. జగనన్నను ఆశీర్వదించాలని ఆయన కోరారు.

జగనన్న ఉంటే అభివృద్ధి మన వెంటే..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే అభివృద్ధి మన వెంటే ఉంటుందని ప్రతి ఒక్కరూ మనసుపెట్టి ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో కులమత పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి మేలు చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మంత్రి అన్నారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, సర్పంచ్ ప్రతిపాటి అనూష, ఎంపీటీసీ కూనసాని మహాలక్ష్మీ, అగ్రికల్చరల్ జిల్లా బోర్డు సభ్యులు పట్టపు నాని, జెసీఎస్ మండల ఇన్‌చార్జ్ కొక్కిలిగడ్డ బాపూజీ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ పాలపర్తి జాన్‌రత్నం, నాయకులు సుగుణకుమార్,అమృతలింగం, సత్యనారాయణ, ఎంపీడీవో పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, కార్యదర్శి ఉమామహేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వరిపంటపై నిలిచిన వర్షం నీరు



కోడూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంట మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు చిక్కుకుంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తూనే ఉంది. ఈదురుగాలుల తీవ్రత కూడా అధికంగా ఉండడంతో 70 శాతానికి పైగా వరిపంట నెలవాలి చాపలా మారింది. ఇప్పటి వరకు మండలంలో కేవలం ఐదు శాతం పంటను మాత్రమే రైతులు యంత్రాల సహాయంతో కోశారు. మిలిగిన వరి పంటంతా ఏపుగా పెరిగి కోతకు సిద్ధంగా ఉంది. నేలవాలిన పంటపై నీరు నిలిచాయని, దీంతో వరిగింజలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని అధికారులు చెప్పడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ముంపు ప్రాంతాలు గుర్తించాలి

గూడూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన తహసీల్దారు బి.విజయప్రసాద్ వర్షాన్ని లెక్క చేయకుండా గ్రామాల్లో పర్యటించి స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఏమైనా గుర్తించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

కౌన్సిల్ సమావేశంలో మేయర్ వెంకటేశ్వరమ్మ





సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు.. (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. కౌన్సిల్ హాలులో సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరంలో 10,497 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 50 డివిజన్లలో 15,358 మందికి వైద్య సేవలు అందించామన్నారు. నగరంలో 64.3 ఎకరాల్లో రూ.550 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మించారన్నారు. 26 నెలల్లోనే కళాశాల పనులు పూర్తి చేసేందుకు కృషి చేసిన సీఎం జగన్, మాజీ మంత్రి పేర్ని నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాపునేస్తం ద్వారా నగరంలోని 2,218 మందికి రూ.15 వేలు చొప్పున అందించామన్నారు. విద్యాదీవెన ద్వారా 8,237 మందికి రూ.28.95 కోట్ల మేర, వసతిదీవెన ద్వారా 6,572 మంది విద్యార్థులకు రూ.10.90 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. మేయర్ ప్రసంగం అనంతరం 23 అంశాలతో ఉన్న ఎజెండాను, రెండుఅంశాలతో ఉన్న టేబుల్ ఎజెండాను సమావేశంఏకగ్రీవంగా ఆమోదించింది. కౌన్సిల్ గుమాస్తా కల్యాణ్ అంశాలను చదవగా అధికార వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల తరుపున కార్పొరేటర్ మేకల సుబ్బన్న ఆమోదాన్ని సభకు తెలిపారు. టీడీపీ సభ్యులు మధ్యలో లేచి ఎజెండాలో లేని రెండు అంశాలను ప్రస్తావించి సభా సమయాన్ని వృథా చేశారు. టీడీపీ సభ్యుల ప్రశ్నలకు పాలకవర్గ సభ్యులు సుబ్బన్న, లంకా సూరిబాబు, మీర్ అస్గర్‌అలీ, జోగి చిరంజీవి, పల్లి శేఖర్ ధీటుగా సమాధానం చెప్పారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు, కమిషనర్ చంద్రయ్య, ఎంఈ శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

98.18 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్లను 4వ రోజైన సోమవారం పంపిణీ చేశారు. నగరంలో 98.18 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మొత్తం 18,977 పింఛన్లు ఉండగా వీటిలో 18,632 పింఛన్లు వలంటీర్లు పంపిణీ చేశారు. పట్టణంలో ఇంకా 345 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా ఆమేరకు చర్యలు తీసుకుంటున్నారు.

తీరంలోనే అధికార యంత్రాంగం బస


తుపాను తీవ్రతపై ప్రత్యేక సమీక్ష



కోడూరులో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్

కోడూరు: తుపాను నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. కోడూరు మండలంపై తుపాను ప్రభావం అధికంగా ఉంటుందనే హెచ్చరికలతో అధికారులంతా తీరప్రాంతాల్లోనే మకం వేశారు. తుపాను స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖలాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు వంటి అంశాలపై చర్చించారు. తుపాను ప్రభావం అధికంగా ఉండే రామకృష్ణాపురం, బసవానిపాలెం, చింతకోళ్ల, జార్జిపేట, పాలకాయతిప్ప గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పీడీ ఆదేశించారు. గ్రామస్థాయి అధికారులంతా తీరంలో బస చేయాలని, పూరిగుడిసెలు, రేకుల ఇళ్లలో ఉండకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల వచ్చే వరకు పునరావాస కేంద్రాల్లోని ప్రజలు అన్ని వసతులు కల్పించాలని పీడీ స్పష్టం చేశారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల పరిశీలన



గిలకలదిండి పునరావాస కేంద్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ అపరాజితసింగ్

మచిలీపట్నంటౌన్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో నగర శివారులోని 20వ డివిజన్ గిలకలదిండిలో తుపాను షెల్టర్, హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గిలకలదిండి కేంద్రంలో 120 మంది, 21వ డివిజన్ బందరుకోట హైస్కూల్, కాసా తుపాను షెల్టరులో 30 మంది ఆ ప్రాంతవాసులు తలదాచుకుంటున్నారు. వీరికి ఉదయం టిఫెన్, మధ్యాహ్నం భోజనం, పాలు అందజేస్తున్నారు. ఈ కేంద్రాలను 20, 21 డివిజన్ కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, మన్నే శారదా, 21వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మన్నే శేషారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి సందర్శించారు. అందుతున్న వసతుల గురించి నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. తుపాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు కార్పొరేషన్ కమిషనర్ చంద్రయ్యను కలెక్టర్ నియమించారు. నగరంలోని పలు డివిజన్లలో ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు నిర్వహించారు. పనులను ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గూడవల్లి నాగరాజు దగ్గరుండి చేయించారు.

పునరావాస కేంద్రాల్లో భోజన వసతి

మోపిదేవి: మండల పరిధిలోని రెండుచోట్ల మోపిదేవివార్పు, కె. కొత్తపాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేక అధికారి, కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎస్.గోవిందు తెలిపారు. పునరావాస కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను వల్ల ప్రాణ, ఆస్తి నష్టపోకుండా ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకుందని తెలిపారు. క్యాంపుల్లో మందులు, తాగునీరు మంచి ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. నదీ గర్భంలో, పల్లపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

షరతులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు..

ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌తో పాటు రవాణాలో కూడా నిబంధనలు సడలించినట్లు చెప్పారు. మాసూలు చేసిన ధాన్యం తేమశాతంతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు రైస్ మిల్లుకు రెవెన్యూ, వ్యవసాయాధికారులు దగ్గర ఉండి తరలిస్తున్నట్లు వివరించారు. దళారుల మాటలు నమ్మి మోసపోకుండా నేరుగా ఆర్‌బీకేలలో సంప్రదించాలని సూచించారు.

1094 మంది తరలింపు



నాగాయలంక: మండలానికి తుపాను స్పెషలాఫీసర్లుగా డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ జి.విజయలక్ష్మిలను జిల్లా కలెక్టర్ నియమించారు. మండలంలో సొర్లగొంది, గుల్లలమోద, సంగమేశ్వరం, దీనదయాళపురం, గణపేశ్వరం, సంగమేశ్వరం తదితర 15 గ్రామాల్లో తుపాను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోకి మొత్తం 859 మంది బాధితులను తరలించి అల్పాహారం, భోజన వసతులు సమకూర్చారు. తుపాను ప్రభావంతో తీరగ్రామాల మత్స్యకారుల చేపల వేట ఆగిపోవడంతో బోట్లు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మండలంలోని ఏటిమొగ-ఎదురుమొండి నడుమ కృష్ణానదిపై తిరిగే పంటును ముందు జాగ్రత్త చర్యగా అధికారులు నిలిపివేశారు. అత్యవసర సేవలకు మాత్రమే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

బంటుమిల్లి: మండల పరిధిలో నాలుగు గ్రామాల్లో మిచాంగ్ తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాలకు చెందిన 135 మందికి పునరావాసం కల్పించినట్లు తహసీల్దారు ఎంవీ సత్యనారాయణ తెలిపారు. ముంజులూరు, నారాయణపురం, బంటుమిల్లి, పెందుర్రు గ్రామాల్లోని పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వారికి కావాల్సిన సౌకర్యాలు, భోజన వసతులు కల్పించినట్లు తహసీల్దారు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

కోడూరు: తుపాను ప్రభావంతో సముద్ర కరకట్ట వెంట నివసించే ఎస్టీ కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉల్లిపాలెం, పాలకాయతిప్ప, ఊటగుండం ప్రాంతాల్లో యానాది కుటుంబాలవారు కరకట్ట వెంట పూరిగుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. సుమారు 120 మంది ఎస్టీలు ఈ గుడిసెల్లోనే నివాసముంటున్నారు. సోమవారం ఉదయం భారీ వర్షం కురుస్తుండగానే అధికారులు ప్రత్యేక ఆటోల్లో ఎస్టీ కుటుంబాలను కోడూరులోని పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి అవసరమైన వసతులు సమకూర్చి అల్పాహారం, భోజనం అందించారు.

వైఎస్సార్ బీమా అందజేత

గూడూరు: మల్లవోలులో మృతి చెందిన గంజాల లక్ష్మయ్యకు వైఎస్సార్ బీమా పరిహారం మంజూరైందని వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు తెలిపారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే లక్ష్మయ్య ఈనెల 1వ తేదీన సహజ మరణం పొందారు. దీంతో మట్టిఖర్చులకు మంజూరైన రూ.10 వేలు సోమవారం మృతుడి భార్య వాకాలమ్మకు అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ కనపర్తి రాజు, సచివాలయ సిబ్బంది హనుమంతరావు, వలంటీర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శివనామస్మరణ

పెడన: కార్తిక మాసం మూడో సోమవారంతో శివాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. పట్టణంలోని శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని భక్తులు వేకువ జాము నుంచే దర్శించుకున్నారు. ఓం నమఃశివాయా అంటూ పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ ఆ స్వామివారిని ప్రార్థించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించడంతో పాటు దీపాలను వెలిగించారు. వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు.